డిఆర్‌పిలకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ ద్వారా పిఎంఎఫ్‌ఎమ్‌ఇలో చిన్న తరహా ఆహార పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు జిల్లా రీసోర్స్‌పర్సన్‌ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఫుడ్ ప్రొసెసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రొసెసింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, వ్యవసాయ, ఉద్యాన, డిగ్రీ, ఏ ఇతర డిగ్రీ అయినా పూర్తి చేసి, బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఆహార పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహికులకు అవగాహన కల్పించడం, బ్యాంకు రుణం ఇప్పించి, వారికి ఆహార పరిశ్రమ స్థాపనకు డిఆర్‌పిగా పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాను, దరఖాస్తును జనవరి 2వ తేదీలోగా పోస్టు ద్వారా, ఈ-మెయిల్ ద్వారా పంపించాలని కోరారు.

కష్టాల నడుమ సేద్యం

జిల్లాలో ఈ ఏడాది కష్టాల నడుమే సేద్యం సాగింది. జులై, ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వేలాది ఎకరాల్లో రైతులు విత్తనాలు వేయలేకపోయారు. వేసవి మాదిరిగా ఎండ వేడిమి ఉండడంతో నారుమళ్లు ఎండిపోయాయి. ఫలితంగా సాధారణ విస్తీర్ణం కంటే తక్కువ శాతంలోనే వరి సాగు అయింది. ఈసారి తుపాన్లు, అధిక వర్షాల ప్రభావం పెద్దగా లేకపోవడంతో రైతులకు కొంత ఊరటనిచ్చింది. ఒకట్రెండు అల్పపీడనాలు భయపెట్టినా పంటపై పెద్దగా ప్రభావం చూపలేదు. ధాన్యం దిగుబడి అనుకున్నంత స్థాయిలో వచ్చినా కొనుగోళ్లు కోసం రైతులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానంతో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

పొందూరులో సుడిదోమతో ఎండిన పంట (ఫైల్)

- వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన సాగు
- సుడిదోమ పోటుతో వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- శివారు భూములకు చేరని వంశధార
- ధాన్యం అమ్ముకునేందుకూ అన్నదాతలకు అవస్థలే

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులను చవిచూడాల్సి వచ్చింది. జులై, ఆగస్టులో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో పంటల సాగుపై కొంత ప్రభావం చూపింది. చాలా ప్రాంతాల్లో వేసిన నారుమళ్లు సైతం ఎండిపోయాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 696.4 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 721.3 మి.మీ సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 30 మండలాలకు గానూ 12 మండలాల్లో అధిక వర్షం, 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. వజ్రపుకొత్తూరు మండలంలోని రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నారు. జిల్లాలో అన్నిరకాల పంటలు కలిపి 4,47,383 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 4,11,288 ఎకరాల్లో (91.93 శాతం) మేర పంటలు సాగయ్యాయి. వరి పంటను 4,06,798 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 3,79,670 ఎకరాల్లో (93.33 శాతం) మాత్రమే వరి పంటను వేయగలిగారు.

ధాన్యం కొనుగోళ్లలో మార్పులు

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ధాన్యం సేకరణలో ఈ ఏడాది యాప్‌ను తీసుకొచ్చారు. ధాన్యం పరీక్షలు, వేబ్రిడ్జి వద్ద తూకం, మిల్లుకు తరలింపు సందర్భాల్లో ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. తేమ శాతం 17 శాతం కంటే మించి ఉంటే ఆరబెట్టి తీసుకురావాలంటూ ఆర్‌బికె సిబ్బంది వాటిని తిరస్కరిస్తున్నారు. రైతులు ఏ మిల్లుకు ధాన్యం అప్పగించాలో ఆన్‌లైన్‌లోనే నిర్ణయించడంతో, వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో రైతులు తమ ధాన్యాన్ని దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. 80 కేజీల బస్తాకు రూ.1632 దక్కాల్సి ఉండగా, రూ.1300 నుంచి రూ.1400 మధ్య లభిస్తోంది.

మారని కౌలు రైతుల దుస్థితి

కౌలు రైతుల దుస్థితి ఈ ఏడాది మారలేదు. భూ యజమానులు అంగీకార పత్రం ఇవ్వకపోవడంతో వేలాది మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులకు నోచుకోలేదు. భూ యజమానులు చివరకు ఆధార్ కార్డును ఇచ్చేందుకూ నిరాకరించారు. జిల్లాలో దాదాపు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉండగా 3,352 మందికి కార్డులను అందజేశారు. కార్డులు పొందినా రైతు భరోసా ప్రయోజనాలకు నోచుకోలేదు. కౌలు గుర్తింపు కార్డు లేకపోవడంతో బాంకుల నుంచి రుణాలూ దక్కలేదు. దీంతో వారు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేసి వ్యవసాయం నెట్టుకొచ్చారు. చివరకు విత్తనాలు దొరకడమూ కష్టంగానే మారింది. కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడంతో విత్తనాల అందజేతకు అధికారులు నిరాకరించారు. దీంతో వారు గత్యంతరం లేక ప్రయివేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేశారు.

వరికి నామమాత్రంగా మద్దతు ధర పెంపు

ఈ ఏడాది వ్యవసాయ ఖర్చులు వేలల్లో పెరగ్గా, కేంద్ర ప్రభుత్వం మొక్కుబడిగా మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంది. పంటలకు దక్కే మద్దతు ధర కనీసం వందల్లో కూడా ఉండడం లేదు. సాధారణ రకం, ఎ-గ్రేడ్ రకంపై రూ.వంద మాత్రమే పెంచింది. గతేడాది సాధారణ రకం రూ.1940 ఉండగా అది రూ.2040కు పెరిగింది. అదేవిధంగా ఎ-గ్రేడ్ రకం ధాన్యానికి గత ఖరీఫ్‌లో రూ.1940 చెల్లించగా, ప్రస్తుతం రూ.2060కు పెంచింది.

ఇకెవైసితో రైతులకు అవస్థలు

పంటల క్రాపింగ్, ఇకెవైసి నిబంధనలతో రైతులకు అవస్థలు తప్పలేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 5,02,728 ఎకరాల్లో పంటల సాగయినట్లు నమోదైంది. మొత్తం 3,81,368 మంది రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ-క్రాప్‌లో మొత్తం పంట అంతా నమోదైంది. ఇకెవైసి దగ్గరకు వచ్చేసరికి మాత్రం అసంపూర్ణంగానే జరిగింది. ఇకెవైసిలో 4,49,172 ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు నమోదైంది. ఇకెవైసి గడువు ముగిసే నాటికి 3,25,787 మంది (90 శాతం) వేలిముద్రలను సేకరించగలిగారు. మొత్తం 55,581 మంది రైతుల వివరాలు నమోదు కాలేదు. ఉపాధి లేక కొంతమంది రైతులు వలస వెళ్లిపోవడంతో వారి వివరాలు నమోదు కాలేదు. వివరాలను నమోదు చేసుకున్న వారి నుంచే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయనుండడంతో ప్రయివేట్ వ్యాపారులకు రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకున్నారు.

వరిపై సుడిదోమ పోటు

పంట చేతికొచ్చే సమయంలో సుడి దోమపోటు రైతులను కలవరపాటుకు గురిచేసింది. కాండంలో చేరి రసం పీల్చేయడంతో పంట ఎండిపోయింది. సుడిదోమ సోకడంతో జిల్లాలో 62.5 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 12.5 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. మరో 50 వేల ఎకరాల్లో పాక్షికంగా నష్టం వాటిల్లింది. సుడిదోమ పంట దిగుబడులపైనా ప్రభావం చూపింది.

సాగునీటికీ తప్పని ఇబ్బందులు

సాగునీటికి ఈ ఏడాది రైతులకు ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా వంశధార కాలువల ద్వారా శివారు భూములకు నీరందలేదు. కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో పూర్తిస్థాయిలో నీరు విడిచిపెట్టలేకపోయారు. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా 1800 క్యూసెక్కులు, కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కుల వరకు మాత్రమే నీరు వదిలారు. దీనికితోడు కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క తొలగించకపోవడంతో టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని శివారు భూములకు వంశధార పారలేదు. దీంతో పొట్టదశలో నీరు అందకపోవడంతో సుమారు 20 వేల ఎకరాలపై ప్రభావం చూపింది.

శ్యామ్‌క్రగ్ కార్మికుల సమస్యలను వివరిస్తున్న అమ్మన్నాయుడు

ఒప్పందాలను ఉల్లంఘిస్తున్న

శ్యామ్‌క్రగ్ యాజమాన్యం

కలెక్టర్‌కు సిఐటియు ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మికులకు న్యాయం చేస్తామని ఉన్నతాధికారుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 యాజమాన్యం కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు విమర్శించారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అమ్మన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ రణస్థలం మండలం వరిశాంలోని శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ లిమిటెడ్ ప్లాంట్-2 పరిశ్రమలో పనిచేస్తున్న 570 మంది కార్మికులకు నెలకు 12 రోజులు మాత్రమే పని కల్పించి వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. దీనివల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనిదినాలు పెంచాలని, కార్మికులకు నెలకు 26 రోజులు పని కల్పించాలని కార్మికులు యాజమాన్యాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో మాదిరిగా పరిశ్రమలో ఉత్పత్తి చేసే రింగుల ఉత్పత్తి ప్రక్రియ పూర్తిస్థాయిలో చేయకుండా కొంత ప్రాసెస్ చేసి మిగతా ప్రాసెస్ చేయడానికి రింగులను వేరే యూనిట్లకు పంపిస్తున్నారని, దీనివల్ల కార్మికులకు పూర్తిస్థాయిలో పని కల్పించడం లేదన్నారు. కొంతమంది కార్మికులతో నెలలో వారాంతపు సెలవులూ ఇవ్వకుండా పనిచేయిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 6న కలెక్టర్, జెసిఎల్ సమక్షంలో కలెక్టరేట్‌లో యాజమాన్యం, యూనియన్‌తో నిర్వహించిన సంయుక్త సమావేశంలో 2020లో యాజమాన్యం ఇచ్చిన 69 రోజులు అదనపు సెలవులకు బేసిక్, డిఎపై 50 శాతం వేతనం జూన్ 30వ తేదీ లోపు చెల్లించాలని ఆదేశించినా ఇంతవరకు చెల్లించలేదన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన 2021-22 ఆర్థిక సంవత్సరం బోనస్ చెల్లించలేదని, ఈ బోనస్‌ను వెంటనే చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా పదేళ్ల సర్వీసు ఉన్నా అక్రమంగా కార్మికులను తొలగిస్తున్నారని, దీనివల్ల కార్మికులు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.అప్పలనర్సయ్య, కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.కూర్మారావు తదితరులున్నారు.

26 నుంచి పాదయాత్ర

- సబ్‌ప్లాన్‌ను పదేళ్లు పొడిగించాలి
- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్ / టెక్కలి

జనవరి 26 నుంచి రెండు నెలల పాటు జిల్లాలో పాదయాత్ర చేపట్టనున్నట్లు పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పద్మరాజు తెలిపారు. మార్చి 26న జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో, టెక్కలి మండలం పాత నౌపడలో జన జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యాన 'విభజన హామీలు, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ సాధనలో యువజనుల పాత్ర' అనే అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందన్నారు. కేంద్రం మెడలు వంచి విభజన హామీలను నెరవేర్చుకోవాల్సిన జగన్ మోడీ ముందు మోకరిల్లారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి పదేళ్ల కిందట కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన సబ్‌ప్లాన్ గడువు వచ్చే నెల 23వ తేదీతో ముగుస్తుందని, మరో పదేళ్లు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎనిమిదిన్నరేళ్ల బిజెపి పాలనలో దేశం అథోగతి పాలైందని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే విభజన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక స్వావలంబన దిశగా దేశం ఎదిగేందుకు పారిశ్రామికాభివృద్ధి అవసరమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సాంకేతిక పరిజ్ఞానం ప్రారంభమైందని చెప్పారు. విద్యార్థుల్లో రాజకీయ విశ్లేషణ అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం యువత అవసరమైతే త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే ముందు ప్రజా ప్రయోజన పార్టీలు ఏవో గ్రహించాలన్నారు. అంతకుముందు జన జాగృతి ఫౌండేషన్ చైర్మన్ పేడాడ పరమేశ్వరరావు, చంద్రశేఖర్ ఆజాద్ రుద్రరాజుకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆజాద్ వివరించారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, ఎఐసిసి సభ్యులు క్రిస్టోఫర్, రాష్ట్ర ఇన్‌ఛార్జి మధుసూదన్ యాదవ్, డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, నాయకులు సనపల అన్నాజీరావు, దువ్వాడ జీవితేశ్వరరావు, కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు పాల్గొన్నారు.

టెక్కలి : మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చలపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో ఫిట్‌మెంట్ 27 శాతానికి తగ్గకుండా మంజూరు చేయాలన్నారు. కరోనాతో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని కోరారు. ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్‌ఐ, డిఎ బకాయిలు, సంపాదిత సెలవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, తదితర వాటిని చెల్లించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయులకు డిడిఒ అధికారాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రావిడెంట్ ఫండ్, ప్రభుత్వ బీమా మొత్తాలు ఉద్యోగుల కుటుంబ అవసరాలకు భద్రతగా నిలుస్తాయని దాచుకున్నా, వాటినీ చెల్లించడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉపాధ్యాయ పోస్టులను కుదించి, ఎత్తివేసేందుకు చేపడుతున్న ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. ధర్నాలో ఎపిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ధాన్యం సేకరణలో రైతులకు అవస్థలు

- కలెక్టర్‌కు సమస్యను వివరించిన సర్పంచ్‌ల సంఘం కన్వీనరు జి.శంకర్
- జెడ్‌పి ఎదుట టిడిపి ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యం సేకరణలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా కన్వీనర్ గొండు శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం జెడ్‌పి కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యాన శ్రీకాకుళం, గార మండలాల రైతులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందన్నారు. 8 కిలోమీటర్లు దాటితే క్వింటాకు రూ.28 ప్రభుత్వం ఇస్తోందని, అంతకు మించి దూరమైన పక్షంలో ప్రభుత్వానికి ఆర్థికభారమవుతోందని, మరోవైపు రైతుకు దూరభారం అవుతోందని చెప్పారు. ఇప్పటికే పాతపట్నం నియోజకవర్గం ఎల్‌ఎన్‌పేట మండల రైతులు శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగిలో మిల్లుకు శ్రీకాకుళం రూరల్ మండలం గూడెం గ్రామానికి చెందిన రైతులు సింగుపురంలోని మిల్లుకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జిల్లాలో ఎన్నో ఉన్నాయని అన్నారు. ఆర్‌బికెల్లో మూడు నెలలకు తాత్కాలిక ప్రాతిపదికన ఐదుగురిని ప్రభుత్వం విధి నిర్వహణకు వినియోగిస్తోందని, వారు ధాన్యం కాటా వేసి మిల్లుకు పంపించేస్తున్నారని చెప్పారు. దీంతో మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం నాణ్యతను తెలుసుకునేందుకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఈ-క్రాప్‌లో నమోదైన వారి నుంచే ధాన్యంకొనుగోలు చేస్తున్నారని, కానీ 60 నుంచి 70శాతం మంది జిల్లాలో కౌలు రైతులు వరి సాగు చేస్తున్నారని, ధాన్యం కొనుగోలు సమయంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్‌బికెల్లో తేమ శాతం పరీక్షలు చేసి, నిర్దేశిత ప్రమాణాలతో మిల్లులకు ధాన్యం పంపుతున్నారని, అయినా తేమ పరీక్షల పేర బస్తాకు 8 నుంచి 10 కేజీల ధాన్యం కొట్టేస్తున్నారని, ప్రభుత్వం ఆధ్వర్యాన చేస్తున్న తేమ పరీక్షలకు మిల్లర్ల పరీక్షలకు వ్యత్యాసం ఎందుకొస్తోందని ప్రశ్నించారు. జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ తక్కువ కాబట్టి రైతులు పండించిన ధాన్యం అన్నీ పో గ్రేడులుగా ఉండాలంటే ధాన్యం ఎగరబెట్టినప్పుడు, సాంప్రదాయ పద్ధతిలో చేస్తున్నందు వల్ల కొంత ధాన్యం తేడా ఉంటుందని, దానికి కూడా మిల్లర్ల వద్ద 8 నుండి 10 కేజీల బస్తాకు తగ్గిస్తున్నారన్నారు. బియ్యం దిగుబడి విషయంలో మిల్లర్లు మాయ చేస్తున్నా పట్టించుకునే వారు లేరన్నారు. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని దగ్గర్లో మిల్లుకు తరలించాల్సి ఉన్నా ఆన్‌లైన్‌లో దూరంగా ఉన్న మిల్లులను కేటాయిస్తున్నారని, అక్కడ రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్న ఈ విధానంపై అధికారులు దృష్టి సారించి సరిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో గొండు వెంకటరమణమూర్తి, బి.వెంకటప్పారావు, మూకళ్ల శ్రీనివాస్, బి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, రైతులు

కొత్త ఇసుక రీచ్‌లకు ఆమోదం

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ఇసుక రీచ్‌లతో పాటు కొత్తగా గుర్తించిన పది ఇసుక రీచ్‌లకు కమిటీ ఆమోదం తెలిపిందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మిస్తున్న ప్రాధాన్యతా భవనాలకు, గృహ నిర్మాణాలకు ఇసుక చాలా అవసరమన్నారు. ఇందుకు ప్రస్తుతం వినియోగిస్తున్న ఇసుక రీచ్‌లతో పాటు జిల్లాలో కొత్తగా గుర్తించిన పది ఇసుక రీచ్‌లకు ఆమోదం తెలియజేసినట్లు తెలిపారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం 1, 2, నరసన్నపేట మండలం వెంకటాపురం, గోపాలపెంట, లుకలాంతో పాటు జలుమూరు మండలం దొంపాక, తిమడాం, ఆమదాలవలస మండలంలోని ముద్దాడపేట, గార మండలంలోని అంబళ్లవలస, శ్రీకాకుళం మండలంలోని పొన్నాం ఉన్నాయన్నారు. వీటితో పలాస, టెక్కలి ఇసుక రీచ్‌లనూ కొనసాగించాలని కమిటీ సూచించిందని చెప్పారు. కంచిలిలో ఇసుక రీచ్ చాలా అవసరమని, వారంలోగా ప్రారంభించి కొనసాగేలా చూడాలని జెసి ఆదేశించారు. సమావేశంలో గనులు, భూగర్భవనరుల శాఖ ఉప సంచాలకులు డి.ఫణిభూషణరెడ్డి, సహాయ సంచాలకులు ఎం.బాలాజీ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సుధాకర్, సరుబుజ్జిలి తహశీల్దార్ బి.రమేష్ కుమార్, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ డి.శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

'స్పందన'కు 199 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 199 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలో సాగు భూములు కలిగి ఉన్నారన్న కారణంతో పెన్షన్లు తొలగించేందుకు వాలంటీర్లు ఇస్తున్న నోటీసులను వెనక్కి తీసుకోవాలని వజ్రపుకొత్తూరు మండలం సైనూరుకు చెందిన ఆదిలక్ష్మి, రామారావు తదితరులు కోరారు. నిరుపేద కుటుంబాలకు భూములు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించినా సమాధానం చెప్పడం లేదన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో సాగవుతున్న మొక్కజొన్నను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న పెన్షన్లను సాంకేతిక కారణాలతో తొలగిస్తున్నారని సాకేటి విశ్వేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. డయాలసిస్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. ధాన్యం కొనుగోలులో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని, తేమ శాతాన్ని సాకుగా చూపించి ఎనిమిది నుంచి పది కిలోల ధాన్యాన్ని తీసేస్తున్నారని, దీనికితోడు మందస మండలంలో ఉన్న రైతులను నరసన్నపేట మిల్లులకు పంపిస్తున్నారని మహేంద్ర రైతు సంఘం నాయకులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ లోపాన్ని సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్పందనలో వచ్చిన వినతులు రీ ఓపెన్ కాకుండా, నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. స్పందన అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. వినతులు ఇచ్చిన వారికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కొన్ని శాఖల్లో నిర్లక్ష్యం ఉందని, అందువల్లే ఫిర్యాదులకు సరైన పరిష్కారం ఉండడం లేదని చెప్పారు. ఫిర్యాదులు మళ్లీ మళ్లీ వస్తున్నాయన్నారు. ఈ లోపాలకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఎస్‌డిసి జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, డిఎస్‌ఒ వెంకటరమణ, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
IA 138/ /2021 IN OS 62/2021

Between:-
Challa Sriramulu …petitioner / plaintiff
And:-
Chukka Ramireddy 14 others ...Respondents -Defendants

R5. Marpu Ramamurthy S/o late Kuramayya aged 68 years, Hindu, residin-gat Sylada Village H/o Sathivada pan-chayat,Gara Mandalam, Srikakulam District.
R11. Marpu Rambabu S/o late Kuramayya aged 50 years, Hindu, residing at Sylada Village H/o Sathivada panchayat ,Gara Mandalam, Srikakulam District.
R12. Marpu Jaggarao S/o late Kuramayya aged 55 years, Hindu, residing at Sylada Village H/o Sathivada panchayat ,Gara Mandalam, Srikakulam District.
R.13 Marpu Haribabu S/o late Kuramayya aged 42 years, Hindu, residing at Sylada Village H/o Sathivada panchayat ,Gara Mandalam, Srikakulam District.

Please take notice that the above IA **138/2022 IN os 62/2021** is posted to **30-12-2022** for your appearance ,you are hereby directed to appear before the Honourable on **30-12 -2022** without fail other the matter will be decided in your absence

B Murali Krishna
ADVOCATE
SRIKAKULAM

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి 'స్పందన'కు 38 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 38 వినతలను ఎస్‌పి జి.ఆర్.రాధిక, అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు స్వీకరించారు. క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఫిర్యాదిదారులు తమ అభ్యర్థనలను రాత పూర్వకంగా విన్నవించుకున్నారు. అనంతరం ఫిర్యాదు దారులతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి సమస్యలును అడిగి తెలుసుకున్నారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టి పరిష్కార మార్గాలు చూపాలని సూచనలు చేశారు. ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలను ఎస్‌పి కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. సివిల్ సంబందించినవి ఆరు, మోసపూరితమైన ఐదు, కుటుంబ తగదాలకు సంబంధించినవి మూడు, ఇతరులు 17, ఆస్తి తగాదాలకు సంబంధించిన మూడు, పాత అర్జీలు 4 ఫిర్యాదులు వచ్చాయి.

టాస్ వేస్తున్న సువ్వారి గాంధీ

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఆమదాలవలస

క్రీడలు విద్యలో అంతర్భాగమని, చదువుతోపాటు ఆటల్లో యువకులు రాణించాలని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నియోజకవర్గ సీనియర్ నాయకుడు సువ్వారి గాంధీ అన్నారు. మండలంలోని గాజులకొల్లివలసలో రామాంజనేయ క్రికెట్ టోర్నమెంట్‌ను టాస్ వేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ధైర్యాన్ని పెంపొందించవచ్చు పేర్కొన్నారు. క్రీడలకు సమయాన్ని కేటాయించి వాటిలో పాల్గొనడం యువకులు, విద్యార్థుల బాధ్యత అని అన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని చక్కని ఆట తీరును కనబరచాలన్నారు. క్రికెట్ టోర్నీ విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పేడాడ వైకుంఠరావు, నాయకులు రాపాక ఎంపిటిసి మాజీ సభ్యులు పోతురాజు సూర్యారావు, చింతాడ శివ, పైడి విజయరామరాజు, బగాది నేతాజీ, గురుగుబెల్లి రాజశేఖర్, శ్రీనివాస్, తేజ, రాకేష్ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వస్తా.. సమస్యలను పరిష్కరిస్తా

రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

ప్రతి గడపకూ వస్తా.. సమస్యను పరిష్కరిస్తానని రాష్ట్ర మత్స్య,పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సుదికొండలో సోమవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి గడపకూ వెళ్లి, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రత్యక్షంగా చూశారు. వికలాంగునితో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. సూదికొండలో ఉన్న ప్రతి సమస్యను

లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

పరిష్కరిస్తానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98శాతం నెరవేర్చగలిగిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని అన్నారు. సుదికొండలో అన్ని వీధులకు రహదారులు, కాలువలతో పాటు మంచినీటి సౌకర్యం, తదితర సమస్యలు లేకుండా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. రానున్న ఎన్నికల్లో మీ ఆశీస్సులు, ఆశీర్వాదాలు జగన్మోహన్‌రెడ్డికి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, స్థానిక వార్డు కౌన్సిలర్ శిష్టి బృందావతి, కౌన్సిలర్ ప్రతినిధి శిష్టి గోపి, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పివి సతీష్, మున్సిపల్ మాజీ చైర్మన్ కొత పూర్ణచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్, కౌన్సిలర్లు సనపల సింహాచలం, పప్పల ప్రసాద్, బడగల బల్లయ్య, బల్ల శ్రీను, అంబటి ఆనంద్, దుర్గాశంకర్ పండా, తదితరులు పాల్గొన్నారు.

లావేరు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని

పలాస : వికలాంగునితో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పెదరావుపల్లి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఏయే కుటుంబాన్ని ఎన్ని పథకాలు అందాయి, లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ ఇటువంటి సంక్షేమం ఏ ప్రభుత్వమూ అమలు చేయలదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, పెద్ది చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

12న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

పొందూరు: మండలంలోని రాపాకలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వచ్చే నెల 12న స్వామి వివేకానంద గ్రంథాలయం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్‌పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.4 వేలుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు జనవరి 8లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పోటీల్లో పేర్లను నమోదు చేసుకునేందుకు ఈ కింది 9949861238, 9949494274, 7799559566 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సాగుదారు హక్కు పత్రం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భూ యజమాని హక్కులకు భరోసా కల్పిస్తూ మరో వైపు వాస్తవ సాగుదరులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ ముద్రించిన పోస్టర్‌ను జెసి ఎం.నవీన్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిసిఆర్‌సి పొందానికి అర్హత, పొందే విధానం, భూ యజమానులకు భరోసా, పంట నష్టపరిహారం, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పథకాల లబ్ధి తదితర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికీ తెలిపేందుకు ఈ పోస్టర్ అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఆర్‌బికెల వద్ద విధిగా ప్రచారం చేసేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, గ్రామీణాభివృద్ధి సంస్థ, పథక సంచాలకులు డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

సరుబుజ్జిలి: కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, మండల కార్యదర్శి టి.ధనుంజయరావు డిమాండ్ చేశారు. మండలంలోని సోమవారం తురకపేట, బుడ్డివలస, ఎల్.కె.పల్లి గ్రామాల్లో తిరిగి కౌలు రైతుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసే వారు లేక కళ్లాల్లో రాశులు కనిపిస్తున్నాయన్నారు. కష్టపడి పండించడం తప్ప వీరికి ఎటువంటి భరోసా లేదన్నారు. సిసిఆర్‌సి కార్డు లేకపోవడంతో ఆర్‌బికెలు ధాన్యం కొనుగోలు చేయడం లేదని పేర్కొన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారని, తీరా పంట చేతికొచ్చేసరికి కొనుగోలు చేయకపోవడంతో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతుల పరిస్థితి కూడా అధ్వానంగా ఉందన్నారు. తేమ శాతం

గ్రామంలో పర్యటిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఎక్కువగా ఉందని చెప్పి మిల్లర్లు దగా చేస్తున్నారని పేర్కొన్నారు. రవాణా ఛార్జీలు ఇవ్వడం లేదని అన్నారు. కొన్ని మిల్లులు అన్‌లోడ్ చేయడానికి బస్తాకి రూ.పది వసూలు చేస్తున్నారని అన్నారు. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన సమయానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో రమణయ్య, వి.అప్పన్న, డి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- పొందూరు

గాయపడిన రమేష్

మండలంలోని లోలుగులో ఆదివారం సాయంత్రం సంభవించిన గ్యాస్ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన లోలుగు పద్మావతి ఇంట్లో గ్యాస్ స్టౌవ్ మరమ్మతులకు గురైంది. అదే గ్రామానికి చెందిన పొట్నూరు రమేష్ స్టౌవ్ మరమ్మతులు చేపడుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి వీరికి అంటుకున్నాయి. దీంతో ఇరువురు కేకలు వేసుకుంటూ బయటికి పరుగులు తీశారు. వెంటనే గ్రామస్తులు ఇంట్లోకి వెళ్లి మంటలు అదుపు చేశారు. తీవ్రంగా గాయపడిన పద్మావతి, రమేష్‌లను 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ ప్రమాదంపై విఆర్ఓ త్రినాథరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సుహాష్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సైన్యంలో చేరి దేశసేవ చేసుకోవడం అందరికీ సాధ్యపడదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జాతీయ స్థాయిలో యుపిపిఎస్‌సి నిర్వహించిన ఎన్‌డిఎ పరీక్ష ఫలితాల్లో నగరానికి చెందిన మునికోటి కమల్ సుహాష్ 202 ర్యాంకు సాధించి ఆర్మీ అధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుహాష్ కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతి లభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సుహాష్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

వినతిపత్రం అందజేస్తున్న తులసీరావు

భూహక్కు పత్రాలు మంజూరు చేయాలి

టెక్కలి రూరల్ : మండలంలో వీర రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని 14-ఎ1, 14-ఎ3, 11బి తదితర సర్వే నెంబర్లలో ఉన్న 21 మంది ఇనామీదారుల, 315 ఎకరాల ఇనామీ భూములను 90ఏళ్లుగా సాగు చేస్తున్నామని, ఈ భూములకు సంబంధించి రైతులకు ప్రభుత్వ రాయితీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బమ్మిడి తులసీరావు ఆధ్వర్యంలో కె.డిల్లేశ్వరరావు, హనుమంతు ఉదయ్ కుమార్, కె.గోపాలరావు, బి.శ్యామలరావు, తదితర రైతులు స్పందనలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 21 మంది ఇనామీదారులకు నుంచి తొలిగించి, రైతులకు శాశ్వత భూహక్కు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

బ్రాహ్మణతర్లా విద్యార్థినుల ప్రతిభ

ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థినులు

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో హెచ్ఎం ఎస్.వి.రమణారావు సోమవారం అభినందించారు. వినియోగదారుల కమిషన్‌లో కేసులను సమర్థవంతంగా పరిష్కరించడం అనే అంశంపై మొదట జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వై.మౌనిక (తెలుగు మాధ్యమం), ఎ.హ్యాపీ (ఆంగ్ల మాధ్యమం), వక్తృత్వ పోటీలో ఎస్.రేష్మలు జిల్లా ప్రథమ స్థానం సాధించి ఒక్కొక్కరు రూ.3 వేలు నగదు బహుమతిని అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వై.మౌనిక వ్యాసరచనలో తెలుగు మాధ్యమంలో ద్వితీయ స్థానం సాధించి రూ.5 వేలు నగదు బహుమతిని గెలుచుకున్నారు. విద్యార్థులకు మార్గదర్శి ఉపాధ్యాయులుగా కొయ్యల శ్రీనివాస రావు, దువ్వాడ జనార్థనరావు వ్యవహరించారు.

వైసిపి ప్రభుత్వంలో ధరలు పైపైకి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస/మందస

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రానికి మేలు చేస్తారని, ఓట్లు వేస్తే ధనవంతుల నుంచి సామాన్యుల వరకు ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి పరిపాలన ఎక్కడా లేదని, ధరలు చూస్తే ఆకాశానికి అంటుకుంటున్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతి శిరీష విమర్శించారు. మందస మండలం నారాయణపురంలో సోమవారం రాత్రి ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో పర్యటిస్తూ వైసిపి పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి మూడేళ్ల పాలనలో మూడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, ఆర్టీసీ ఛార్జీలు ఇస్తానుసారంగా పెంచుకుపోతున్నారని, సామాన్యుడు బస్సులో ప్రయాణం చేసేందుకు భయపడుతున్నారని అన్నారు. ఇంటింటికీ చెత్త పన్ను వసూలు చేసే పరిస్థితి చూస్తుంటే రాష్ట్రాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో ప్రజలు అవగాహన చేసుకోవాలన్నారు. ఎక్కడ చూసినా అక్రమాలు, దోపిడీలు, కొండలు సైతం మాయం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు ఇస్తూనే మరోవైపు విద్యుత్, ఆర్టీసీ, నిత్యావసర వస్తువులపై ధరలు

మాట్లాడుతున్న గౌతు శిరీష

పెంచుకుంటూ ప్రజలను పీడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బి.దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, మడియా శ్రీరాములు, ముదిమించి నవీన్, సిర్ల కృష్ణారావు, తులసీరావు, నారాయణపురం గ్రామ కమిటీ అధ్యక్షులు మడియా ధర్మారావు, సీనియర్ నాయకులు బొంగి దామోదర్, మల్లేన జనార్ధన, జి.భోగిరాజు, జి.శ్రీను, డి.నీలకంఠం, తారకేశ్వరరావు, టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

'ఎంజిఆర్' ఆత్మీయ సమ్మేళనం

గ్రామంలో పర్యటిస్తున్న గోవిందరావు

ఎల్ఎన్‌పేట : స్థానిక లలితా భువనేశ్వరి ఫంక్షన్ హాల్లో మండలంలోని ముఖ్య నాయకులతో టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ, నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారసత్వ, వలస నాయుకులు వల్ల నియోజకవర్గం వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. వలస వారసత్వ రాజకీయాలను స్వస్థి చెప్పి స్థానికులకు పట్టం కట్టాలని కోరారు. అంతకు ముందు ర్యాలీగా వెళ్లి ప్రజలకు అభివాదం తెలిపారు. కోయిలపు కృష్ణమాచార్య, అంపిలి నాయుడు, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, కుంచాల బాలకృష్ణ, పంగ కృష్ణారావు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భారత ఆర్థిక దౌత్యవేత్త

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో ఉంటున్న భారత ఆర్థిక దౌత్య, సీనియర్ ఐఎఎస్ అధికారి కోట రవి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మ్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం అనివేటి మండపంలో వారికి స్వామివారి శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో

జ్ఞాపికను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించకుంటే సమ్మె

టెక్కలి, టెక్కలి రూరల్: బకాయి పడ్డ తొమ్మిది నెలల వేతనాన్ని తక్షణమే చెల్లించాలని లేకుంటే సమ్మెకు వెళ్తామని సమగ్ర రక్షిత మంచినీటి పథకం కాంట్రాక్టు కార్మికులు తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ, ఎస్ఇ, డిఇలు విజయ్‌రాజ్, మోహనరావుకు సమ్మె నోటీసును సిఐటియు ఆధ్వర్యాన అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా జీతాల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, క్రిస్మస్ వెళ్లిపోయిందని, సంక్రాంతి వస్తోందని చెప్పారు. పండగల వేళ వారేం తిని బతకాలని, పిల్లల స్కూల్ ఫీజులు, కిరాణాకు డబ్బులు లేక అప్పుల

నోటీసును అందిస్తున్న కార్మికులు

పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల బకాయి వేతనాలు చెల్లించకుంటే జనవరి 1 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్మికులు ఎం.సురేష్, బి.సంతోష్‌కుమారి, ధనుంజయ, రత్నాకర్, పాపారావు, రమేష్ పాల్గొన్నారు.

బంగారు పతకంతో లోకేశ్వరి

కస్తూరిబా విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని జాడపూడి కస్తూరిబా పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని బి.లోకేశ్వరి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వాణికుమారి తెలిపారు. తూర్పుగోదావరిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో యోగా పోటీల్లో లోకేశ్వరి ప్రథమ స్థానం పొంది, బంగారు పతాకం సాధించినట్లు తెలిపారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు, పిఇటి మహాలక్ష్మి, ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్, సర్పంచ్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సాయిరెడ్డిని కలిసిన 'లోతుగెడ్డ'

కొత్తూరు : రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పాతపట్నంను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. వంశధార నిర్వాసితులకు పెండింగులో ఉన్న బిల్లుల మంజూరుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. పాతపట్నంలోని అగ్నిమాపక స్టేషన్‌ను నిర్మించాలని కోరారు. ఈ సమస్యలపై ఎంపీ సానుకూలంగా స్పందించారు.



సాయిరెడ్డితో తులసీవరప్రసాదరావు

'చార్లెస్ బాబేజ్' జీవితం ఆదర్శం

మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణ

ఆమదాలవలస: కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజీ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎస్ఐ వై.కృష్ణ అన్నారు. బాబేజ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఇమ్మానుయేల్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజానికి కంప్యూటర్ అని పరికరాన్ని అందించిన ఘనత బాబేజ్ సొంతమని పేర్కొన్నారు. ముఖ్యవక్త దగ్గివలస రాంప్రసాద్ మాట్లాడుతూ జయాపజయాలతో సంబంధం లేకుండా ఎంతో కష్టపడ్డ బాబేజ్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎస్‌విఎస్ విద్యాసంస్థ ప్రతినిధి పేడాడ ప్రతాప్ ఆహూతులను అలరించేలా మాట్లాడారు. ఇమ్మానుయేల్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పొన్నాడ విజయ్ ఆధ్వర్యాన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ శశిధర్

కవిటి: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శశిధర్ సూచించారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలోని కెజిబివి పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇటీవల కాలంలో పాఠశాలలో విద్యార్థులకు తరచుగా జలుబు, దగ్గు వస్తుండటంతో ఉపాధ్యాయుల కోరిక మేరకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. అంతేకాకుండా విద్యార్థులు చల్లని పదార్థాలు, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు భౌతిక దూరం పాటించి తప్పకుండా మాస్క్ వాడాలని సూచించారు. వైద్య సిబ్బంది అభిమన్యు సోయి, కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్రిగ్స్'లో విద్యార్థుల ప్రతిభ

పోలాకి: ఈ నెల 21 నుండి 23 వరకు మబగాం హైస్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీల్లో ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అభినందించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని చెప్పారు. ఈగల సన్యాసి 1500 మీటర్లు, 3000 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. జూనియర్స్ విభాగంలో ఎస్.ఉదయసాయి మొదటి స్థానం, ఎం.దినేష్ తతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. అలాగే బాలికల విభాగంలో తేజేశ్వరి, యమునా తతీయ స్థానం సాధించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రవీణ

12 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జనవరి 12, 13వ తేదీల్లో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్ష, కార్యదర్శి బి.సింహాచలం, పి.ప్రసాద్ తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటనను విడుదల చేశారు. పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు షీల్డ్స్ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల టీంలు జనవరి 10వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎం.గణేష్, జి.దొరబాబు 8179954351, 9701566164 ఫోన్ నెంబరులను సంప్రదించాలని కోరారు.

అద్భుత ప్రదర్శనకు పతకాలు

ఇచ్ఛాపురం: శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగణి కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం ఇచ్ఛాపురం నాట్య కళాకారులకు అరుదైన అవకాశం లభించింది వారణాసిలో 75వ ఆజాదిక అమత్ మహోత్సవాల్లో ఇండియా కల్చరల్ ఫెస్టివల్ సందర్భంగా కళాకారులు ప్రదర్శన అందరకీ ఆకట్టుకుంది. ఆర్గనైజర్ కె.చంద్రశేఖర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో పది రోజులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం శ్రీ స్వేచ్ఛ నృత్య తరంగిణి నాట్య కళాకారులకు అవకాశం లభించింది. 25 డిసెంబర్ 2022 ఆదివారం రాత్రి నాట్య ప్రదర్శనలో పాల్గొన్న నాట్య కళాకారులు అద్భుత ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ విభాగంలో కె.కుమార్, బి.భవాని, బి.నయని, టి.ఉషారాణి,

పతకాలతో నాట్య కళాకారులు

ఎంబివి మధురిమ, పి.వర్షిత, జి. భార్గవి, పి.సంగీత, జూనియర్ విభాగంలో పి.సత్యశ్రీ ఎ.కృతజ్ఞ, ఎం.తేజసా, పి.జ్ఞానేశ్వరి ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నాట్య కళాకారులకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎసిపి ప్రవిన్ కుమార్, కె.చంద్రశేఖర్‌రావు సిల్వర్ మెడల్స్, ప్రశంసా పత్రలు అందజేశారు. క్రీడాకారులకు అకాడమీ నాట్య గురువు మంగి దివ్య, అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దానమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పౌర సరఫరాల హమాలీల ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో పౌరసరఫరాలశాఖ పరిధిలో రోజుకో విధానం తీసుకొచ్చి ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, అందులో భాగంగా స్టేజ్-2ను రద్దు చేసి మిల్లర్ల నుంచి డీలర్లకు పంపించే విధానం తీసుకురావడంతో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీలు నష్టపోతారని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎ.షణ్ముఖరావు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యాన హమాలీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ముందుగా ఎపిఎన్‌జిఒ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేజ్-2ని రద్దు చేసి డైరెక్గా స్టేజ్-1 నుంచి

ధర్నా చేస్తున్న హమాలీలు

డీలర్లకు బియ్యం సరఫరా చేయడంతో గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీలు ఉపాధి కోల్పోతారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు చిక్కాల గోవిందరావు, సంఘం నాయకులు రంగారావు, అప్పారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న గౌతు శివాజీ, శిరీష

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- పలాస, వజ్రపుకొత్తూరు

మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్ తల్లి బొడ్డు గంగమ్మ, వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామానికి చెందిన పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పోతనపల్లి సాంబమూర్తి తల్లి సీమమ్మ మతి చెందడంతో సోమవారం మాజీ మంత్రి గౌతు శ్యామసుందర్ శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మతుల కుటుంబాలను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారితో పాటు టిడిపి జిల్లా కార్యదర్శి పి.విఠల్ రావు, కిక్కర ఢిల్లీరావు, దువ్వాడ సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ తామడ త్రిలోచనరావు, సూరాడ మోహనరావు అరసవల్లి ఉమామహేశ్వరరావు, దాసరి జేజేరావు, మల్లా శ్రీను, అంబటి రామకృష్ణ, ఆకుల పాపారావు, పోతనపల్లి షణ్ముఖరావు, రెయ్యి గణపతి, రాజశేఖర్, సింగుపల్లి బాలకృష్ణ, సాతుపల్లి కమేష్, కోడ చిరంజీవి, ప్రసన్న పాల్గొన్నారు.

ట్రోఫీని అందుకుంటున్న సుధాకర్

నడక పోటీల్లో సుధాకర్‌కు బంగారు పతాకం

లావేరు : రాష్ట్రంలోని నెల్లూరులో ఈ నెల 24, 25 తేదీల్లో వాకర్స్ ఇంటర్నేషన్ కన్వెన్షన్ సందర్భంగా మూడు కిలోమీటర్ల నడక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సంజీవిని నళిని సుధాకర్ పాల్గొని ప్రథమ స్థానంలో గెలుపొంది బంగారు పతకం, ట్రోఫీని ఎంపీ బీదా మస్థానరావు చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే ఈ ఏడాదిలో జిల్లా రాష్ట్రజాతీయ స్థాయిలో పదిహేడు పతకాలను సాధించంచారు. ఈ మేరకు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎన్.వి.ఎన్.సుబ్బారెడ్డి, గజల్ శ్రీనివాసరావు, టివి కళాకారుడు విగ్రాజు ప్రశంసించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

స్వామిత్వ సర్వే వేగవంతం

పలాస: మండలంలో స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం స్వామిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు, డి.పట్టాలు, గ్రామకంఠం, ప్రైవేట్ వ్యక్తుల ఆస్తుల వివరాలను సర్వే చేసి వారికి హక్కు పత్రాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా ప్రజలకు భూముల ఆక్రమణలు జరగకుండా నివారించవచ్చని అన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సంఘం అధ్యక్షులు లండ శ్రీధర్, సుధాకర్, సద్గుణ బాబు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

'కళ్యాణమస్తు'పై అవగాహన కల్పించాలి

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

ప్రజాశక్తి- జలుమూరు

కళ్యాణమస్తు పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపిడిఒ జివి. రవికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వెలుగు అంగన్వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం, ఇతర మైనారిటీ, వెల్ఫేర్ బోర్డులో రిజిస్టర్ కాబడిన భవన, ఇతర నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన పెళ్లి కుమార్తెలు, వారి కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందించేందుకు ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. పెళ్లి కుమార్తెకు 18, కుమార్తెకు 21 ఏళ్లువివాహ తేదీ నాటికి పూర్తయి ఉండాలని, పెళ్లి కుమారుడు, కుమార్తె పదో తరగతి పరీక్షలు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇరు కుటుంబాలు బిపిఎల్ కేటగిరీకి చెందిన వారై ఉండాలన్నారు. 01.10.2022 తేదీ నుంచి జరిగిన వివాహాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేటగిరీల వారీగా ఆర్థిక సహాయం అందజేయబడుతుందన్నారు. వివాహ తేదీ నుంచి 60రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్ఆర్ కళ్యాణ మస్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఎపిఎం ప్రసాదరావు అధ్వర్యంలో మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, సిసిలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, ఎంపిడిఒ కె.రామారావు, మాజీ ఎంపిపి కె.మోహన్‌రావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

జలుమూరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్ఆర్ కళ్యాణ మస్తు పథకంపై సచివాలయ వెలుగు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ చంద్రకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి వావాహమైన వారు అర్హులని తెలిపారు. పెళ్లి అయిన 60 రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఎం లలిత, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : వైఎస్ఆర్ కళ్యాణమస్తు/షాదీ తోఫా పథకంపై గ్రామస్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

చిరంజీవికి లక్ష్మీనారాయణ ప్రశంసలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ పల్లంటి చిరంజీవిని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ప్రశంసించారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన మెగా ఇంపాక్ట్ కార్యక్రమంలో ఆదివారం రాత్రి ఆయన ప్రశంసాపత్రాన్ని చిరంజీవికి అందజేశారు. పట్టణానికి చెందిన చిరంజీవి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ట్రైనర్‌గా, మెంటారుగా వ్యవహరిస్తున్నారు. డిజైనర్ టాక్ పేరిట ప్రతి రోజూ ఉదయం 7గంటలకు జూమ్ సెషన్స్ ద్వారా నిర్వహిస్తారు. సంబంధిత టాపిక్‌పై నిష్ణాతులు ప్రతి రోజూ ఈ డిజైనర్ టాక్‌లో మాట్లాడుతుంటారు. విద్యార్థిలోకానికి చేస్తున్న సేవలకు గాను లక్ష్మీనారాయణ, ఇంపాక్ట్ ఫౌండేషన్ అధినేత గంప నాగేశ్వరరావు, ప్రముఖ వక్త ఆకెళ్ల రాఘవేంద్ర, యోగా విజ్ఞాన కేంద్ర వ్యవస్థాపకులు జగన్ గురూజీ సమక్షంలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.. ఈ సందర్భంగా చిరంజీవిని ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ సోను శ్రీనివాస్, కో-ఆర్డినేటర్లు, కోర్ టీం మెంబెర్లు ఆకుల ఉదయభాస్కర్, ఆర్‌విఆర్, నాగలక్ష్మి, గిరి ప్రసాద్, తదితరులు అభినందించారు.

చిరంజీవికి అవార్డు అందిస్తున్న లక్ష్మీనారాయణ

సామాజిక బాధ్యత అవసరం

ప్రజాశక్తి- సోంపేట

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని మేమున్నాం స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షులు టి.తరినయ్య అన్నారు. సోమవారం పలాసపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తమ వంతు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ అయ్యే ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం హరికృష్ణ, సంస్థ సభ్యులు తిరుపతిరావు, విజయ శంకర్, జీవన్.మూర్తి, చక్రధర్, త్రినాథరావు, తారకేశ్వరరావు, షేక్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తరినయ్య

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న టెక్కలి, పాతపట్నం నియోజకవర్గ స్థాయి జోనల్ క్రీడాపోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ పోటీలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో 74 పాఠశాలల నుంచి క్రీడాకారుల బృందాలు పాల్గొన్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలతో పాటు అథ్లెటిక్స్ నిర్వహించారు. గెలుపొందిన వారిని విజేతలుగా ప్రకటించారు. క్రీడలకు హాజరైన వారికి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా మౌలిక సదుపాయాలను నిర్వాహకులు కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుల డివిజన్ సంఘం నాయకులు బాడాన నారాయణరావు పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణరాజా, కెకె.రామిరెడ్డి, జగ్గమ్మ, వెంకటరమణ, కాపల రఘునాథరావు, కె.ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజలు వాస్తవాన్ని గ్రహించాలి

టెక్కలి: వైసిపి ప్రభుత్వం ప్రజల్ని వంచించి పాలిస్తోందని, అవాస్తవాలను ప్రచారంలోకి తీసుకొచ్చి వాస్తవాలను కప్పిపుచ్చుతోందని, వీటిని ప్రజలు గ్రహించాలని టిడిపి టెక్కలి మండల అధ్యక్షులు బి.శేషగిరి అన్నారు. మండలంలోని పోలవరం పంచాయతీలోని పలు గ్రామాల్లో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, కోళ్ల లవకుమార్, మామిడి రాము, కోళ్ల కామేష్, మెమడ దమయంతి, మల్లిపెద్ది మధు, దవళ రామచంద్రరావు, ఇప్పిలి జగదీష్, సోడిమూడి కిరణ్‌కుమార్, పేర మురళి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

'ఆపస్' క్యాలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉపాధ్యాయ సంఘం ఆపస్ 2023వ టేబుల్ పాకెట్ క్యాలెండర్లను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపస్ ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తూ... మరోవైపు విద్యార్థుల్లోను, ఉపాధ్యాయుల్లోను జాతీయ భావాలను పెంపొందించడానికి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నర్సింగరావు, గోవిందరావు, రాజగోపాల్ పాల్గొన్నారు.

దళితులను మోసగిస్తున్న ప్రభుత్వం

పి.ఎం.జె బాబు

శ్రీకాకుళం అర్బన్ : దళిత ఓట్లతో గద్దెనెక్కిన సిఎం జగన్మోహనరెడ్డి అదే దళితులను అడుగడుగునా కించపరుస్తూ మోసం చేస్తున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు ఆరోపించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలు జగన్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకం రద్దు చేసి, తిరిగి అంబేద్కర్ పేరును తొలగించి వైఎస్ఆర్ విద్యా పథకంగా పేరు మార్చారని అన్నారు. ఈ పథకాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి గోర సురేష్ పాల్గొన్నారు.

ట్యాబ్‌లను చూపిస్తున్న విద్యార్థులు

ట్యాబ్‌ల పంపిణీ

జి.సిగడాం : మండలంలోని పేనసాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులకు బైజ్యూస్ శ్యాంసంగ్ ట్యాబ్‌లను సర్పంచ్ టి రామారావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రామి నాయుడు, వైస్ ప్రెసిడెంట్ నాగవరపు సాయి, ఎంపిటిసి కుదిరేళ్ల సుజాత, స్కూల్ చైర్మన్ పి.రాజులమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

హెల్పింగ్ సొసైటీ చేయూత

వజ్రపుకొత్తూరు: పేద విద్యార్థికి ఉన్నత విద్య అభ్యసించేందుకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ చేయూత అందించింది. పెద్దపల్లివూరుకు చెందిన కంసు సరోజిని భర్త టిబి వ్యాధితో ఇటీవల మృతి చెందారు. కూలి పనులు చేస్తూ కొడుకు రాజేష్‌ను చదివిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలోనే మాన్పించేయాలని యోచించారు. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు డిగ్రీ పూర్తి అయ్యే వరకు చదువు బాధ్యతను తీసుకొని మొదటి విడతగా సోమవారం రూ.7 వేలు అందించారు. కార్యక్రమంలో షణ్ముఖపండా, జోగారావు, చంటి, సాయి, ఢిల్లీరావు, దిలీప్, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కుమార్‌నాయక్

11న సిక్కోలు కళా జాతర

ప్రజాశక్తి- పలాస

మండలంలోని చిననీలావతి గ్రామంలో జనవరి 11న సిక్కోలు కళాజాతర నిర్వహిస్తున్నామని వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు తెలిపారు. కళా జాతర కరపత్రాలను స్థానిక కాళమ్మ ఆలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్‌నాయక్ మాట్లాడుతూ ఈ కళా జాతరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి వివిధ కళాకారులు హాజరవుతున్నారన్నారు. ముఖ్యఅతిథిగా ప్రజా గాయకుడు గద్దర్ వస్తున్నారని తెలిపారు. కళాజాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళావేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి కుత్తుమ వినోద్, సర్పంచ్ ఎస్.తిరుపతిరావు, సభ్యులు గొరకల లోకేశ్వరరావు, మడియా వాసుదేవ్, మాధవరావు పాల్గొన్నారు.

పార్టీ కండువా వేస్తున్న సాయికుమార్

వైసిపిలోకి రాముడు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని ఎన్.జి.ఆర్.పురం పంచాయతీ టిడిపి నాయకులు సన్నపల్లి రాముడు వైసిపిలోకి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ రాముడుకు వైసిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు తండ్యాంలో స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీ, గూనానపేట ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 10 గంటలకు నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. తండ్యాం నుంచి గూనానపేట మీదుగా కిల్లారిపేట రోడ్డు పనులను ప్రారంభిస్తారని చెప్పారు. గూనానాపేటలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కుళాయిలను ప్రారంభిస్తారని తెలిపారు. గ్రామంలోని యాదవులకే గొర్రెలను పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, హాజరుకావాలని కోరారు.

సబ్ కలెక్టర్‌కు దళితుల వినతి

టెక్కలి: మండలంలోని రావివలస గ్రామం వద్ద పాఠశాలకు సమీపంలో దళితులమైన తాము రాళ్లు కొట్టుకొని జీవనం సాగిస్తున్నామని, తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డిని కోరారు. సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల తరబడి ఆ ప్రదేశంలో రాళు కొట్టుకొని జీవిస్తున్నామని, తమకు ఉపాధినిచ్చే స్థలంలో జగనన్న ఇళ్ల కాలనీకి ఇచ్చేందుకు చూస్తున్నారని, సుమారు 40 కుటుంబాలు ఆ స్థలాన్ని నమ్ముకొని జీవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు అధికారుల సర్వేను అడ్డుకుంటామని సబ్ కలెక్టర్‌కు స్పష్టం చేశారు.

రాకేష్‌రెడ్డికి అభినందనలు

రణస్థలం రూరల్: కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.రాకేష్‌రెడ్డిని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నియమించారు. రుద్రరాజు సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా రాజేష్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రినాయుడు, డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తకోట్ల లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

నేడు వాహనాల వేలం

రణస్థలం రూరల్ : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ (ఎక్సైజ్ కార్యాలయం) వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు బైక్‌ను వేలం వేస్తున్నామని ఎస్ఐ కె.అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనాలని ఆసక్తి ఉన్న వారు ఉదయం 9 గంటలకు రూ.వెయ్యి నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పలాస: కాశీబుగ్గ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు తొమ్మిది వాహనాలను వేలంపాట వేస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ కృష్ణారావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోంపేట: ఎస్ఇబి కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10గంటలకు ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు అధికారి టి.వెంకటప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వెయ్యి రూపాయలు ధరావత్ చెల్లించి, తమ ఆధార్ కార్డును తీసుకురావడం ద్వారా వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 944092358 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శ్రీకాంత్ బృందానికి అవార్డుల ప్రదానం

శ్రీకాకుళం అర్బన్ : ఈ నెల 23 నుంచి 25 వరకు ఏలూరు అభినయ నృత్య భారతి ఆధ్వర్యాన జాతీయ నృత్య ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో నగరానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం పాల్గొని పలు సత్కారాలు అందుకున్నారు. కూచిపూడి కళాకారులు, గిన్నిస్ బుక్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ అర్ధనారీశ్వరం వెంకట్ స్మారక యువ నృత్య పురస్కారం-2022ను శ్రీకాంత్ శిష్యుడు రామకౌండిన్యకు ప్రదానం చేశారు. అదేవిధంగా ఏటా వివిధ రంగాల్లో నిష్ణాతులైన నృత్య కళాకారులకు అందిస్తున్న నృత్య కౌముది అవార్డును గాయత్రి వర్షితకు అందజేశారు. ఈ అవార్డులను అభినయ నృత్య భారతి సంస్థ అధినేత గురు హేమసుందర్ అందజేశారు.

శ్రీశయన సంఘం మండల అధ్యక్షునిగా సత్యనారాయణ

సత్యనారాయణ

ఆమదాలవలస : శ్రీశయన సంఘం మండల నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గంగిళ్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా తొక్క రఘుబాబు, గుజ్జల ఎర్రయ్య, ఆడంగి రమణ, ప్రధాన కార్యదర్శిగా లబ్బ వెంకటరమణ, సహాయ కార్యదర్శిగా రుప్ప రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బోగి నాగరాజు, సహాయ కార్యదర్శిగా లావేటి వెంకటరమణను ఎన్నుకున్నారు. వీరితో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘం బోలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

మండల బడ్జెట్ ఆమోదం

మాట్లాడుతున్న ఎంపిపి గోపి

ప్రజాశక్తి- జలుమూరు

ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి వాన గోపి అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం సోమవారం నిర్వహించారు. 2022-23 సవరణ బడ్జెట్, 2023-24 సాధారణ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. 2022-23 సవరణ బడ్జెట్ రూ.47.31 లక్షలు, 2023-24 సాధారణ బడ్జెట్ రూ.49.67 లక్షలకు ఆమోదించారు. ఈ నిధులతో మండలంలోని వివిధ పంచాయతీల్లో రోడ్లు, తాగునీటి సరఫరా తదితర పనులకు వినియోగించనున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బడ్జెట్‌లో కేటాయించిన పనులను త్వరితగతిన చేపట్టాలని సభ్యులకు సూచించారు. ఈ బడ్జెట్ సమావేశంలో ఎంపిడిఒ జి.వి.రవికుమార్, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పాలిసెట్ పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేయాలి

పలాస : పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ సీతారామ్మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్‌లో వినతి అందజేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు పేరాడ అంబికాప్రసాద్, గుజ్జు ధనుంజయ రెడ్డి, లొడగల రవీంద్ర, రాజ్యలక్ష్మి, తిరుపతి రావు, రమేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆలయ భూమికి రీ సర్వే చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేటలో మెయిన్ రోడ్డు పక్కన ఉన్న శ్రీ చింతామణి అమ్మవారు ఆలయ స్థలం ఆక్రమణ గురికాకుండా రీ సర్వే చేయాలని వార్డు కౌన్సిలర్ పత్రీ తవిటియ్య అధ్వర్యంలో గ్రామస్తులు తహశీల్దార్‌ను కోరారు సోమవారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. ఆలయ భూమి రీసర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తే ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఈశ్వరరావు, కేశవరావు, పాపారావు, ఉమ్మయ తదితరులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్‌కు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈ నెల 31వ తేదీలోగా పిఎం కిసాన్‌కు ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ దానకర్ణుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇకెవైసి వివరాలు అన్ని ఆర్‌బికెల్లో ఉంచామని చెప్పారు. ఈ ఏడాది రబీ పంటల నమోదు మొదలైందన్నారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ అందుతాయని చెప్పారు. రైతులు విధిగా ఆర్‌బికెకి వెళ్లి తమ వివరాలు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జాడుపల్లి సర్పంచ్ ప్రతినిధి జనపరెడ్డి కన్నబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఈశ్వరి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ దానకర్ణుడు

కేక్‌ను కట్ చేస్తున్న పద్మప్రియ

ఘనంగా కృష్ణచైతన్య జన్మదినం

ప్రజాశక్తి- పోలాకి

జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పుట్టిన రోజు కేకును కోసి పలువురికి పంచిపెట్టారు. అనంతరం రోగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పిన్నింటిపేట కేంద్రంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన పద్మప్రియ, డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి క్రిష్ణ రావు,ఉప ఎంపిపిలు కలగదండు తాతారావు, కోట అప్పారావు, చింతాడ ఉమా, ఆర్. త్రినాథరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఐటిడిఎ పిఒకు వినతి

మెళియాపుట్టి: మండలంలోని ముకుందపురం పంచాయతీలో ఎదురవుతున్న సమస్యలపై ఐటిడిఎ పిఒ నవ్యకు సోమవారం వినతి పత్రాన్ని అందించినట్లు సర్పంచ్ సవర భాస్కరరావు తెలిపారు. దారిపేట గ్రామానికి అంగన్వాడీ సెంటర్ మంజూరు చేయించాలని, సానిపాలెం-కూర్మన్నపేటకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని పిఒకు గ్రీవెన్స్ లో విన్నవించినట్లు తెలిపారు.

తహశీల్దార్‌కు వినతి

మెళియాపుట్టి: మండలంలోని పలువురు పెన్షనర్లు తమకు అందిన నోటీసులపై తహశీల్దార్ సరోజనికి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. పెన్షన్‌దారులకు అధికంగా భూమి ఉందని నోటీసులు ఇవ్వడంతో వారు ఆందోళన చెందారు. కార్యక్రమంలో మారడికోట పెన్షనర్లు, తదితరులు ఉన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగ గ్రామంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ జగనన్న భూహక్కు పత్రాలను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మండలంలోని రఘునాథపురం, వింధ్యగిరి, చండిపుట్టుగ, పుటియాదల రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులకు భూ హక్కు పత్రాలు అందజేసినట్లు తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, డైరెక్టర్ ఎన్ని అశోక్, తహశీల్దార్ అప్పలరాజు, డిటి టి.రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి, విఆర్‌ఒలు వజ్జ గిరిబాబు, నారాయణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.